నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | మంగళవారం 22 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

పోలీస్ అమరవీరుల చిహ్నానికి గౌరవ వందనం చేస్తున్న సీపీ శ్రీనివాస్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం

రామగుండం సీపీ శ్రీనివాస్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 21 : అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటామని, ఏ సమస్య వచ్చినా తమను సంప్రదించాలని రామగుండం కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం రామగుండం కమిషనరేట్‌లో నిర్వహించిన పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవానికి కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి డీసీపీ చేతన్‌తో కలిసి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల దినోత్సవం నిర్వహించుకోవడం వెనుక సైనికుల వీరోచిత పోరాటం, మహోన్నత చరిత్ర దాగి ఉందన్నారు. అనంతరం అమరవీరుల చిహ్నానికి గౌరవ వందనం చేశారు. నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాశ్, పెద్దపల్లి స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, ఏసీపీ కృష్ణ, గోదావరిఖని ఏసీపీ రమేశ్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, రామగుండం ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏసీపీ ప్రతాప్, సీఐ, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్

త్యాగాలు మరువలేనివి..

13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు

హాజీపూర్, అక్టోబర్ 21 : పోలీసుల అమరుల త్యాగాలు మరువలేనివని 13వ ప్రత్యేక తెలంగాణ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ వెంకట్రాములు అన్నారు. సోమవారం గుడిపేట 13వ బెటాలియన్‌లో పోలీసు అమరులకు నివాళులర్పించారు. కమాండెంట్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అనేక మంది పోలీసులు వీర మరణం పొందారని, వారి త్యాగాలు మరవలేనివని పేర్కొన్నారు. అంతకుముందు పోలీసుల అమర వీరుల స్తూపం వద్ద నివాళులర్పించారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలో నిలిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ నాగేశ్వర్‌రావు, కాళిదాస్, బెటాలియన్ యూనిట్ వైద్యులు సంతోష్ సింగ్, ఆర్ఐలు, ఆర్ఎస్సైలు, శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లు, బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కమాండెంట్ వెంకట్రాములు

పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, ఎస్పీ శ్రీనివాస్

కష్టకాలంలో గుర్తుకొచ్చేది పోలీసే

ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 21 : కష్టకాలంలో మొదట గుర్తుకువచ్చేది పోలీసేనని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావుతో కలిసి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎస్పీ మాట్లాడుతూ అమరులైన పోలీస్ కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటామని భరోసానిచ్చారు. అనంతరం అమరుల స్తూపం వద్ద నివాళులర్పించారు అమరుల కుటుంబ సభ్యులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు కరుణాకర్, రామానుజన్, సీఐలు, ఎస్ఐలు ఉన్నారు.

కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకి అస్వస్థత

ఆసిఫాబాద్‌లో నిర్వహించిన పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవానికి ముఖ్య అతిథి గా హాజరైన కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అస్వస్థతకి గురయ్యారు. అమరుల స్తూపం వద్ద నివాళులర్పించే క్రమంలో అస్వస్థతకు గురికాగా, వెంటనే స్పందించిన సహాయకుడు కలెక్టర్‌ను పట్టుకున్నాడు. పండ్ల రసం తాగి కాసేపు సేద తీరారు. ఎండ తీవ్రత వల్లే అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.

భయంవద్దు.. మేమున్నాం

మాజీ ఎంపీపీ స్వర్ణలతతో ఫోన్‌లో మాట్లాడిన కేటీఆర్

కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న స్వర్ణలత

మాజీ ఎంపీపీ మందపెల్లి స్వర్ణలతను పరమార్శిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

హాజీపూర్, అక్టోబర్ 21 : 'అధికార పార్టీ నాయకులు పెట్టే అక్రమ కేసులకు భయపడకండి. పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుంది'.. అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మంత్రి కేటీఆర్.. హాజీపూర్ మాజీ వైస్ ఎంపీపీ మందపెల్లి శ్రీనివాస్ భార్య, మాజీ ఎంపీపీ స్వర్ణలతకు ఫోన్‌లో భరోసానిచ్చారు. ఇటీవల మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌పై కొందరు దాడి చేయగా, సోమవారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు రాపల్లిలోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. మాజీ మంత్రి మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో శ్రీనివాస్ చికిత్స పొందుతుండగా పోలీసులు వ్యవహరించిన తీరు సరైనది కాదన్నారు. అనంతరం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫోన్ చేసి స్వర్ణలతతో మాట్లాడించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ భరోసానిచ్చారు. రాపల్లి గ్రామ మాజీ సర్పంచ్ అనె మల్లేశ్ గ్రామ యువత, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సర్వేలు.. ఎంక్వైరీలతోనే సరిపెడతారా?

- ఇప్పటికే పలుమార్లు సర్వే చేయించిన సీసీఎల్ఏ, కలెక్టర్లు
- గత కలెక్టర్లకు, ప్రస్తుత కలెక్టర్‌కు ఇచ్చిన రిపోర్టులన్నీ బుట్టదాఖలు
- తాజాగా సీసీఎల్ఏ ఆదేశాలతో డీసీవో ఆధ్వర్యంలో కొనసాగుతున్న విచారణ
- మరి ఈసారి ఏం జరిగేనో !

టీఎన్జీవో హౌసింగ్ సొసైటీలో అక్రమాలు తేలేదెన్నడు

మంచిర్యాల, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : నస్పూర్ మున్సిపాలిటీలోని టీఎన్జీవో హౌసింగ్ సొసైటీలో అక్రమాల లెక్కలు తేలడం లేదు. ఈ విషయమై ఫిర్యాదులు వెల్లువెత్తగా, అనేకసార్లు సర్వేలు చేసిన అధికారులు ఇప్పటికీ స్పష్టతకు రాకపోవడమేమిటన్నది అంతుబట్టడం లేదు. టీఎన్‌జీవోలు, ప్రజాసంఘాల నాయకులు వినతుల మేరకు గత కలెక్టర్లు, చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్(సీసీఎల్ఏ), రాష్ట్ర ఎన్నికల కమిషనర్.. ఇలా ఎందరో ఉన్నతాధికారులు ఈ భూములపై సర్వేలు చేయించారు. సర్వేలు చేసిన ప్రతిసారి ఆ రిపోర్టులు సీసీఎల్ఏకు, కలెక్టర్లకు అందజేశారు. ఇప్పుడున్న కలెక్టర్ సైతం వచ్చీరాగానే కలెక్టరేట్ సమీపంలోని సర్వే నంబర్ 42తో పాటు టీఎన్జీవో భూములపై సర్వే చేయించారు. ఆ రిపోర్టు సైతం సార్‌కు అందింది. ఇవన్నీ జరిగాక.. ఇటీవల రిటైర్డ్ టీఎన్‌జీవోలు ఈ ప్లాట్ల కేటాయింపుల్లో తమకు అన్యాయం జరిగిందంటూ సీసీఎల్ఏకు ఫిర్యాదు చేశారు. దీంతో సీసీఎల్ఏ మరోసారి టీఎన్జీవో భూములపై ఎంక్వైరీకి ఆదేశించింది. కలెక్టర్ ఆ బాధ్యతలను డిస్ట్రిక్ట్ కో-ఆపరేటివ్ ఆఫీసర్(డీసీవో) సంజీవరెడ్డికి అప్పగించారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతున్నది. ఇలా ఇప్పటికే ఎన్నోసార్లు సర్వేలు జరిగినా టీఎన్జీవో హౌసింగ్ సొసైటీలోని అక్రమాల లెక్కలు మాత్రం బయటికి రాలేదు. సీసీఎల్ఏకు ఇచ్చిన సర్వే రిపోర్టులు, గత కలెక్టర్లు, ప్రస్తుత కలెక్టర్‌కు ఇచ్చిన సర్వే రిపోర్ట్‌లన్నీ బుట్టదాఖలయ్యాయి.

సర్వే నంబర్ 42లో టీఎన్జీవోలు నిర్మిస్తున్న ఇండ్లు

ఇప్పటి వరకు చేసిన సర్వేలు ఇలా...

- టీఎన్జీవో భూములపై ఓ సామాజిక కార్యకర్త 1-11-2023న రెవెన్యూ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి ఆ ఫిర్యాదు అదే నెల 7న సీసీఎల్ఏకు వచ్చింది. దాన్ని సీసీఎల్ఏ కలెక్టర్‌కు 17న పంపించింది. దీనిపై సర్వే చేయాలంటూ కలెక్టర్ ఆర్డీవోను ఆదేశించగా, ఆయన జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ఆరుగురు సర్వేయర్లతో సర్వే చేయించారు. పూర్తి నివేదికను సర్వేయర్లు ఆర్డీవోకు అప్పగించారు. టీఎన్జీవోల 119 హౌస్‌సైట్స్, వాటి ప్రస్తుత స్టేటస్, లే-అవుట్ స్కెచ్ మ్యాప్ మొత్తం రిపోర్టు కలెక్టర్‌కు అందజేశారు.
- రెండోసారి అదే సామాజిక కార్యకర్త వారం వ్యవధిలోనే మంచిర్యాల జిల్లాలోని కొందరు రెవెన్యూ, మున్సిపల్ అధికారులు సర్వే నంబర్ 42లో అక్రమాలకు పాల్పడుతున్నారంటూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు నవంబర్ 6, 2023లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్కడి నుంచి సీసీఎల్ఏ ద్వారా కలెక్టర్‌కు ఎంక్వైరీ చేయమని మరోసారి ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు ఆర్డీవో స్థాయిలో సర్వే చేసిన రిపోర్ట్‌ను మరోసారి సీసీఎల్ఏకు పంపించారు.
- మూడోసారి ప్రస్తుత కలెక్టర్ కుమార్ దీపక్ 27-6,2024న సర్వే నంబర్ 42లోని 102.10 ఎకరాలపై సర్వే చేయాలంటూ కిందిస్థాయి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంచిర్యాల డివిజన్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫర్ సర్వే జీ.గంగాధర్ సమక్షంలో ఐదురుగురు తహసీల్దార్లు, నస్పూర్ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారితో సర్వే చేయించారు. ఈ రిపోర్టు కూడా కలెక్టర్‌కు చేరింది. సర్వే నంబర్42కు సంబంధించిన సమస్త సమాచారంతో ఈ సర్వే రిపోర్టు కలెక్టర్‌కు చేరింది.
- ఇన్నిసార్లు రిపోర్టులు కలెక్టర్లకు.. అక్కడి నుంచి సీసీఎల్ఏకు సర్వే నంబర్ 42, టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ భూములపై నివేదిక వెళ్లినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా రిటైర్డ్ టీఎన్జీవోలు కొందరు ప్లాట్ల కేటాయింపుల్లో తమకు నష్టం చేశారంటూ సీసీఎల్ఏకు ఫిర్యాదు చేయడంతో మరోసారి కలెక్టర్‌ను విచారణకు ఆదేశించింది. ఆ బాధ్యతను కలెక్టర్ డీసీవోకు అప్పగించారు. ప్రస్తుతం విచారణ కొనసాగుతున్నది.

ఎన్ని సార్లు సర్వే చేస్తారు

-నయీం పాషా, సామాజిక కార్యకర్త

సర్వే నంబర్ 42, టీఎన్జీవో హౌసింగ్ సొసైటీపై ఇప్పటికే ఎన్నోసార్లు సర్వేలు చేశారు. సీసీఎల్ఏ, కలెక్టర్లకు ఆ రిపోర్టులు అందజేశారు. అయినా మళ్లీసారి విచారణ అంటూ కాలయాపన చేస్తున్నారు. అంటే గతంలో సర్వే చేసి, అందజేసిన రిపోర్టులకు విలువ లేదా.. లేకపోతే గత అధికారులు సరిగా సర్వే చేయలేదా. ఇప్పుడు డీసీవో ఆధ్వర్యంలో చేస్తున్న విచారణలోనైనా నిజానిజాలన్నీ బయటపెట్టాలి. నష్టపోతున్న టీఎన్జీవోలకు న్యాయం చేయడంతో పాటు సర్వే నంబర్ 42లోని ప్రభుత్వ భూములను సంరక్షించాలి.

ఇన్ని రిపోర్టులు వచ్చినా క్లారిటీ లేదు..

ఇలా ఇప్పటికే మూడుసార్లు సర్వేలు చేసి రిపోర్టులు ఇచ్చినా సర్వే నంబర్ 42, అందులోని టీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అక్రమాలపై అధికారులకు క్లారిటీ ఎందుకు రావడం లేదన్నది ప్రశ్నార్థకంగా మారింది. సర్వేయర్లు, తహసీల్దార్లు సర్వేలు చేసి ఇచ్చాక కూడా అక్రమార్కులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదనేది ప్రశ్నార్థకంగా మారింది. గత కలెక్టర్లతో పాటు ప్రస్తుత కలెక్టర్‌కు ఇచ్చిన సర్వే నివేదికలు బుట్టదాఖలైనట్లేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అసలు టీఎన్జీవోలకు ల్యాండ్ అలాకేషన్ చేశాక.. అందుకు సంబంధించి వాళ్లు గవర్నమెంట్‌కు డబ్బులు చెల్లించకుండానే ఇంటి నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒకరికి కేటాయించిన ప్లాట్‌లో మరొకరు ఇప్పుడు ఇల్లు కడుతున్నారు. ఇదే విషయమై రిటైర్డ్ టీఎన్జీవోలు సీసీఎల్‌కే ఫిర్యాదు చేశారు. ఇప్పుడు విచారణ జరుగుతుండగానే హడావుడిగా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయిస్తున్నారు. గత కలెక్టర్ల హయాంలో ఇలా విచారణ జరిగిన సమయాల్లో నిర్మాణ పనులు చేయొద్దని ఆదేశాలిచ్చారు. ఇప్పుడు విచారణ జరుగుతుంటే మరోవైపు వేగంగా నిర్మాణాలు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. టీఎన్జీవోల్లో నష్టపోయిన ఉద్యోగులకు న్యాయం చేయకుండానే అక్రమ నిర్మాణాలకు పరోక్షంగా జిల్లా అధికారులు సహకరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. డీసీవో విచారణ పూర్తయ్యే వరకు ఇండ్ల నిర్మాణాలు నిలిపివేయాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి.

దండారీ దర్బార్ పోస్టర్ల ఆవిష్కరణ

వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమారి దీపక్, ఆదివాసీ నాయకులు

కాసిపేట, అక్టోబర్ 21 : సల్పాలవాగు సమీపంలోని వెంకటాద్రి గుడిలో ఈ నెల 27న నిర్వహించే ఆదివాసీ దండారీ దర్బార్ వాల్ పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ కుమార్ దీపక్ ఆవిష్కరించారు. ఆదివాసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో మడావి గంగారం, ఆదివాసీ కమిటీ అధ్యక్షుడు ఆడె జంగు, వర్కింగ్ ప్రెసిడెంట్లు పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, ప్రచార కార్యదర్శి ఆత్రం జంగు, ఉపాధ్యక్షులు కనక గోవర్ధన్, నైతం లక్ష్మణ్ పాల్గొన్నారు.

పెంచికల్ పేట్: ప్రధాన చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సిర్పూర్(టీ) : మండలకేంద్రంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు

సర్కారుపై బీఆర్ఎస్ ఆగ్రహం

- రైతు భరోసా ఇవ్వాల్సిందేనని డిమాండ్
- పెంచికల్ పేట్, సిర్పూర్(టీ)లో రాస్తారోకో

పెంచికల్‌పేట్/సిర్పూర్(టీ), అక్టోబర్ 21 : కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. రుణమాఫీ చేయాలని, రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టింది. వర్కింగ్ ప్రెసిడెంట్, సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆర్ఎస్పీ పిలుపు మేరకు సోమవారం పెంచికల్‌పేట్ మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు బిట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రేణులు, రైతులు రాస్తారోకో నిర్వహించారు. అరగంట పాటు ప్రధాన రహదారిపై ఆందోళన చేపట్టడంతో రవాణా స్తంభించింది. బిట్టు శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే వారిని మోసం చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు న్యాయం జరిగే వరకూ నిరసనలు చేపడుతామన్నారు. ఎస్ఐ కొమురయ్య అక్కడికి చేరుకొని రాస్తారోకోను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కోట సతీశ్, నాయకులు దేవాజీ, పత్రు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిర్పూర్(టీ)లోని బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ మండల కన్వీనర్ అస్లాంబిన్ అబ్దుల్లా ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు ధర్నా నిర్వహించారు. ఇచ్చిన హామీ మేరకు రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పనాస లక్ష్మణ్, రాజేశ్, షేక్ చాంద్, నందాజీ, ప్రకాశ్, సంతోశ్, రైతులు పాల్గొన్నారు.

పెంచికల్ పేట్ : బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో అడ్డుకున్న ఎస్ఐ కొమురయ్య

క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

నస్పూర్, అక్టోబరు 21 : ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమన్వయంతో పరిష్కరించేలా కృషి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు, మందమర్రి, జన్నారం, లక్షెట్టిపేట, మంచిర్యాల, దండేపల్లి ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందించారు. మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రజావాణిలో 21 దరఖాస్తులు వచ్చాయన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, అక్టోబర్ 21 : ప్రజా సమస్యలపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి దరఖాస్తులు స్వీకరించారు. ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

గెలిపిస్తే సమస్యలపై గళ మెత్తుతా

పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ నరేందర్‌రెడ్డి

మాట్లాడుతున్న అభ్యర్థి నరేందర్ రెడ్డి

లక్షెట్టిపేట, అక్టోబర్ 21 : ఎన్నికల్లో గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగుల సమస్యలపై మండలిలో గళమెత్తుతానని ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అల్ఫోర్స్ అధినేత డాక్టర్ వీ,నరేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని కేఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసేందుకు కృషి చేస్తానని, ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుతల వారీగా విడుదల చేసేందుకు ముందుండి పోరాడుతానన్నారు. విద్యారంగ సమస్యలపై మంచి అనుభవముందన్న విషయం ప్రతి ఒక్కరికీ తెలుసని, స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా నిరుద్యోగుల్లో నైపుణ్యాన్ని పెంపొందించి సులువుగా ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించేందుకు ఉచిత శిక్షణ కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలల్లో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం కొత్తగా కొలువులు సాధించిన ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులంతా కోచింగ్ సెంటర్లు, గ్రంథాలయాలకు వెళ్లి చదువుకోలేరని, వాళ్ల కోసం త్వరలో ఒక యాప్ రూపొందిస్తామన్నారు. అంతకుముందు పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలను సందర్శించిన ఆయన పట్టభద్రుల ఎన్నికలపై అవగాహన కల్పించడంతో పాటు ఆయా విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక న్యాయస్థానంలో బార్ అసోసియేషన్ సభ్యులతో మాట్లాడారు. న్యాయవాదుల రక్షణ చట్టం కోసం మండలిలో పోరాడుతానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వివిధ కళాశాలల అధ్యాపకులు, పట్టభద్రులు ఉన్నారు.